క్లుప్తంగా

ఉచిత పశువైద్య శిబిరం


మందులు పంపిణీ చేస్తున్న వైద్యురాలు

శివంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గంగాయిపల్లి గ్రామంలో గోపాలమిత్ర ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 26 పశువులకు గర్భధారణ పరీక్షలు, నాలుగింటికీ గర్భధారణ ఇంజక్షన్స్, దూడలకు నట్టల నివారణ మందులు వేయడంతో పాటు మరికొన్ని పశువులకు చికిత్స అందించామని వెటర్నరీ వైద్యురాలు సంధ్యారాణి, గోపాలమిత్ర గణేశ్ పేర్కొన్నారు.

పాఠశాలల తనిఖీ


విద్యార్థితో పాఠం చదివిస్తున్న ఎంఈఓ

రామాయంపేట(మెదక్): మండలంలోని ఝాన్సిలింగాపూర్ గ్రామంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలలతో పాటు అక్కన్నపేటలో ప్రాథమిక పాఠశాలను మంగళవారం మండల విద్యాధికారి నీలకంఠం సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. మంచిగా చదువుకోవాలని సూచించారు. ఈసారి పదో తరగతిలో మంచి ర్యాంకులు సాధించాలన్నారు. ఫలితాలు మెరుగు పడేలా ఉపాధ్యాయుల కృషి చేయాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులందరూ ఉదయం, సాయంత్రం జరిగే ప్రత్యేక తరగతులకు హాజరు కావాలని ఎంఈఓ అన్నారు. ఆయన వెంట పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రామకంఠంలో ఖాళీ ప్రదేశాలపై సర్వే

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ కంఠంలోని ఖాళీ ప్రదేశాలను గుర్తించి, వాటిని సర్వే చేయించామని సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామకంఠంలో గల పలు ఖాళీ ప్రదేశాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, భవిష్యత్‌లో ఆ స్థలాలు కబ్జాకు గురి కాకుండా, ఆ స్థలాలను ఆర్కిటెక్చర్ సంతోష్‌తో సర్వే చేయించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయించామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఫొటో పెట్టండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): రాజ్యాంగ దినోత్సవాల సందర్భంగా జాతీయ పతాకవిష్కరణ చేసే సమయంలో జెండా ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు చేయాలని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ మన్నన్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు స్వామి, నాయకులు విజయ్ కుమార్, బాబు, కుమార్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు పెద్దశంకరంపేటలో మండల సమావేశం

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి హాజరుకానున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

'సోలార్ సిస్టం'ను ఉపసంహరించండి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వం తలపెట్టిన జలశాయాల సోలర్ సిస్టం వ్యవస్థను వెంటనే ఉపసంహరించాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా కన్వీనర్, ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి ముదిరాజ్ ఒక ప్రకటనలో కోరారు. జలశాయాలపై తేలియాడేలా సోలార్ ప్యానల్స్ బిగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలన్న మంత్రి బట్టి విక్రమార్క ప్రతిపాదనలు అమలైతే మత్స్యకారులకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ప్రతిపాదనలు వెంటనే విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాలకు కాళేశ్వరం నీళ్లు తీసుకొస్తా

దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి


నర్సంపల్లిలో పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): కాళేశ్వరం కాల్వ నీళ్లను గ్రామాలకు తీసుకొస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నార్సింగి మండలం నర్సంపల్లి, నర్సంపల్లి పెద్దతండాలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. నర్సంపల్లిలో పల్లె దవాఖాన, మహిళా భవనం, ఎస్సీ కమ్యూనిటీహాల్, పెద్దతండాలో గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ప్రహరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీగా ఉన్నప్పుడు దుబ్బాక ప్రజల కోసమే పని చేశానన్నారు. మన ప్రభుత్వం లేకున్నప్పటికీ గతంలో రెండు సార్లు ఎంపీగా పని చేసిన అనుభవం, పరిచయాలతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముందుగా కాళేశ్వరం కాల్వ పనులు పూర్తిచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి రైతులకు సాగునీరు అందించేలా కృషి చేస్తానన్నారు. చిన్న గ్రామాలైనప్పటికీ నర్సంపల్లి, నర్సంపల్లి పెద్దతండా సర్పంచ్‌లు భారతీసత్యం, చత్రియానాయక్ అభివృద్ధిలో ముందున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సబితారవిందర్, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌గౌడ్, సీడీపీఓ స్వరూపరాణి, ఐకేపీ ఏపీఎం అశోక్, సీసీ సుల్తానా, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాబు, రాజేశ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు శ్రీపతిరావు, బాషా, లాలు ఉన్నారు.

మల్లికార్జునస్వామి ఉత్సవాలు ప్రారంభం


గంగకు వెళ్తున్న గ్రామస్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో వెలిసిన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు వల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా మంగవారం ఉదయం అభిషేకం, దేవతాపూజ, ఒగ్గు కళాకారులు భక్తులు కలిసి డోలు వాయిద్యాల మధ్య గంగకు వెళ్లుట, హారతి నిర్వహించారు. బుధవారం సామూహిక ఘట్టాభిషేకం, గండ దీపాలు, శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కల్యాణం, అగ్నిగుండాలు, బండ్ల బోనాల ఊరేగింపు ఉంటాయి. గురువారం రుద్రయాగం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, శుక్రవారం జాతర ముగింపులో భాగంగా రథోత్సవం, హారతి ఉంటుంది. మూడు రోజుల పాటు నిత్య అన్న ప్రసాదంతో పాటు సమయానుకులంగా ఒగ్గు కథలు, సాంస్కృత కార్యక్రమాలు, భక్తి భజన పాటలు ఉంటాయి.

పాఠశాల సమస్యలు పరిష్కరించండి


ఎస్టీ గురుకులంలో అపరిశుభ్రంగా ఉన్న బాత్‌రూంను పరిశీలిస్తున్న వినోద్‌నాయక్

కౌడిపల్లి(నర్సాపూర్): గురుకుల పాఠశాల, కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గిరిజన జన సమితి తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వినోద్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం కౌడిపల్లిలో ఎస్టీ గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను పరిశీలించి, విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్నారు. బాత్‌రూంలు, మరుగుదొడ్లు సరిగా లేవని నీటి సమస్య ఉందన్నారు. గురుకుల పాఠశాల పరిసరాలు సైతం చెత్త చెదారంతో ఉన్నాయని పరిశుభ్రత లేదని చెప్పారు. పరిసరాల్లో దుర్గంధం వస్తుందన్నారు. శానిటైజేషన్ చేయడం లేదని, విద్యార్థులకు తరగతులు సైతం సరిగా జరగడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు


విద్యార్థులకు సూచనలిస్తున్న నోడల్ అధికారి

పెద్దశంకరంపేట(మెదక్): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వ్యాసరచన, క్విజ్, లాంగ్‌జంప్ తదితర పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 26న బహుమతులను అందజేయనున్నారు. ఆయా పాఠశాలల్లో కొనసాగుతున్న పోటీలను మండల నోడల్ అధికారి వెంకటేశం పర్యవేక్షించారు.

చెకుముకి పోటీలు


కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో చెకుముకి పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు చెకుముఖి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండల కోఆర్డినేటర్, ఉపాధ్యాయుడు శేషగిరి ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు. తరగతి వారీగా ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులను మండల స్థాయికి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం రాధాకిషన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు పక్కాగా నిర్వహించండి

మండల నోడల్ అధికారి బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): పాఠశాల ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్కగా నిర్వహించాలని మండల నోడల్ అధికారి, హెచ్ఎం బాలరాజు తెలిపారు. మంగళవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో మండల హెచ్ఎంలకు ఎస్ఎంసీ ఎన్నికలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 29న ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకోవాలని చెప్పారు. ప్రతీ తరగతి నుంచి ఆయా తరగతికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రుల్లో ముగ్గురిని ఎన్నుకోవాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ సభ్యులు ఉండాలన్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌ల్లో స్త్రీ, పురుషులు ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాధకిషన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ


మాట్లాడుతున్న పాలకవర్గ సభ్యులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో సర్పంచ్ సుజాత అధ్యక్షతన మంగళవారం గ్రామ అభివృద్ధి ప్రణాళికపై గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. 2024 – 25 గాను గ్రామాభివృద్ధికి కేంద్రం ద్వారా వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించేందుకు చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికలపై గ్రామ సభలో చర్చించారు. గ్రామంలో మొదట ప్రాధాన్యతను బట్టి ఆ పనులకు నిధులు కేటాయించిన తర్వాత మిగతా అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేయాలన్నారు. ఈ గ్రామసభలో పంచాయతీ వార్డు సభ్యులు సురేశ్, శంకరయ్య, దుర్గేశ్, రమేశ్, పంచాయితీ కార్యదర్శి ప్రియాంక, గ్రామస్థాయిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, నాయకులు శేఖర్, కృష్ణ, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యువత దేశం కోసం పని చేయాలి

ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ శ్రీధర్‌జీ


బహుమతులు అందిస్తున్న ప్రచారక్ శ్రీధర్‌జీ

మెదక్ కలెక్టరేట్: నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద జీవితాలను యువత ఆదర్శంగా తీసుకొని దేశ సేవకు కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ లింగంశ్రీధర్‌జీ పిలుపునిచ్చారు. నేతాజీ, వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా ఇటీవల యువజన ఉత్సవాల పేరుతో క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారికి మంగళవారం మెదక్‌లో బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ లింగంశ్రీధర్‌జీ హాజరై మాట్లాడుతూ... యువత మన దేశం కోసం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అతిథిగా డాక్టర్ పెంటా గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, మెదక్ జిల్లా కన్వీనర్ శశికాంత్, మెదక్ విభాగ్ సంఘటన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా వ్యవస్థ ప్రముఖ్ సాయిలు, మోయి గారి నవీన్ కుమార్, ఏబీవీపీ నాయకులు ఉదయ్, ప్రశాంత్, విజ్ఞాన్, సత్య, మహేశ్వరి పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

కొల్చారం(నర్సాపూర్): ఆపద సమయంలో అల్లరి మూకలను ఎదిరించే క్రమంలో బాలికలకు కరాటే స్వయం ఆత్మ రక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని మండలంలోని పైతర గ్రామ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో రెజూకీ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. ఎగ్జామ్‌కు జిల్లా స్థాయి నుంచి 100 మంది హాజరైనట్లు కరాటే మాస్టర్ మల్లేశం తెలిపారు. ఈ ఎగ్జామ్‌కు రెజూకీ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు, సీనియర్ కరాటే మాస్టర్ నగేష్ హాజరై ఎగ్జామ్‌లో ఉత్తీర్ణులైన వారికి బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ.. 173 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కరాటేలో శిక్షణ ఇస్తామని అన్నారు. ఈ ఎగ్జామ్ అబ్జర్వర్లుగా దినకర్ భూపాల్ గణేశ్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘురాం, బిందు, రమేశ్, రాంచందర్, రవళి పాల్గొన్నారు.


బెల్టులు అందుకున్న వారితో కరాటే మాస్టర్స్, ఉపాధ్యాయులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రామాయంపేట(మెదక్): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు సాగాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. మంగళవారం రామాయంపేటలో జరిగిన సంఘం తాలూకా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందించడానికి ఉద్యోగులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ దిశగా సంఘం కృషి చేస్తుందన్నారు. నూతన పింఛన్ విధానం, కంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విషయం, ఆదాయపు పన్ను పరిమితి పెంపు, తదితర సమస్యలు పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. అనంతరం రామాయంపేట పాత తాలూకా సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనుముల ప్రభాకర్, కార్యదర్శులుగా నిఖిల్, శ్రీనివాస్, సహ అధ్యక్షుడిగా గాంధీ, ఉపాధ్యక్షులుగా ప్రదీప్‌కుమార్, నాంపల్లి, నవీన్, రాజు, మహిళా ఉపాధ్యక్షురాలిగా సుధ తదితరులు ఎన్నికయ్యారు.

నేతాజీ చేసిన సేవలు మరువలేం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం నేతాజీ సుభాశ్ చంద్రబోస్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో, పాఠశాలల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ఉపాధ్యాయులు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. నేతాజీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన మార్గంలో నడవాలని పేర్కొన్నారు.


రామాయంపేట బాలికల గురుకుల పాఠశాలలో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


చేగుంట(తూప్రాన్): వడియారంలో..


తూప్రాన్‌లో..


టేక్మాల్‌లో..

ఆధ్యాత్మికతతో మనశ్శాంతి

రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ


హనుమాన్ విగ్రహం వద్ద మాధవానంద సరస్వతీ

నర్సాపూర్ రూరల్: మండలంలోని పెద్ద చింతకుంటలో వెలసిన జల హనుమాన్ ఆలయం ఆవరణలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన 21 అడుగుల హనుమంతుడి విగ్రహాన్ని సందర్శించి పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు సమయానుకూలంగా హనుమాన్ లేదా ఇతర ఆలయాలకు వెళ్లి ఆధ్యాత్మికతకు సమయాన్ని కేటాయిస్తే ఆరోగ్యంతో పాటు మనసు ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, భిక్షపతిగౌడ్, ఆలయ చైర్మన్ బాలరాజ్, వైస్ చైర్మన్ ప్రభుగౌడ్, యాదగౌడ్, శ్రీశైలం, కిషన్, అర్చరులు రాధాకష్ణ శర్మ, హరి ప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సన్మానం**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చండి ఉన్నత పాఠశాల నుంచి ఇటీవలే బదిలీపై వెళ్లిన మెహర్‌బేగంను పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం అరుణ, సర్పంచ్ ఉమాఅనిల్, ఉపాధ్యాయులు విజయేందర్, వామనశర్మ, హేమలత రోజ్‌మేరీ, సంతోష్‌కుమార్, పుష్ప, నారాయణరావు, జీవరత్నం, ప్రసాద్‌రెడ్డి, పురుషోత్తమ్‌రావు తదితరులు ఉన్నారు.

◆ **దరఖాస్తులకు ఆహ్వానం**

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం ఉమ్మడి మండలం పోతులబోగుడ మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ల కోసం ఫిబ్రవరి 22 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ మల్లిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆరవ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7 నుంచి 10 తరగతిలో సీట్ల ఖాళీలను బట్టి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్ష రుసుము ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.125, జనరల్ విద్యార్థులకు రూ.200 చేల్లించాల్సి ఉంటుందన్నారు.

◆ **టై, బెల్టుల పంపిణీ**



పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని బాచారం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం సర్పంచ్ వెంకట్ రాములు విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు తీసిపోని స్థాయిలో ఉండాలని, చదువుల్లో మంచి ప్రతిభ కనపర్చాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో నాయకులు దుర్గయ్య, ఉప సర్పంచ్ రాము, హెచ్ఎం సంతోష్, టీచర్లు మమత, తోటవ్వ, గణేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు

◆ **పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ అధ్యక్షుడిగా సంతోష్**

చేగుంట(తూప్రాన్): గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఉల్లితిమ్మాయిపల్లి పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఎన్నికయ్యారు. మెదక్ జిల్లాలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రజాస్వామ్య పద్ధతిలో బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించగా అత్యధిక ఓట్లతో సంతోష్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నర్సాపూర్ మండలం మద్దూర్ పంచాయతీ కార్యదర్శిగా పాతూరి రవిని ఎన్నుకున్నారు.

◆ **దుర్గమ్మకు ప్రత్యేక పూజలు**

పాపన్నపేట(మెదక్): హైదరాబాద్‌లోని చింతల్ మాజీ కార్పొరేటర్ వీపీ సాగర్ రావు మంగళవారం ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సీనియర్ అడ్వకేట్ కామారెడ్డి వేణు, హన్మంత్‌రావు, రాంమోహన్ తదితరులు ఉన్నారు.



◆ **ఘనంగా ఎల్లమ్మకు బోనాలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలో మల్లన్న ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి రేణుక ఎల్లమ్మ దేవికి ఘనంగా బోనాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శామీర్‌పేట నర్సింగరావు, సర్పంచ్ ఎల్లం, ఉప సర్పంచ్, నరహరి, రాయిలాపూర్ సర్పంచ్ శేఖులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

◆ **29న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేసిన కమిషనర్**

నర్సాపూర్‌రూరల్: ఈనెల 29న నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి కౌన్సిల్ సభ్యులంతా సకాలంలో హాజరు కావాలని తెలిపారు. సభ్యులు హాజరు కాని పక్షంలో ఈనెల 30న ఎన్నిక నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

◆ **ఉర్దూ విద్యార్థులకు గైడ్స్ పంపిణీ**

సదాశివపేట(సంగారెడ్డి): కార్వన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్ పదో తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉచితంగా ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ చేశారు. ఏఐఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షుడు ఎంపీ అసదొద్దీన్ ఒవైసీ సూచనల మేరకు మంగళవారం పట్టణ అధ్యక్షుడు గౌస్‌పాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.